క్లుప్తంగా

క్రికెట్ పోటీలు ప్రారంభం

పులివెందుల రూరల్ : పట్టణంలోని వెంకటాపురం గ్రామంలో ఆదివారం క్రికెట్ పోటీలను వైఎస్సార్ సీపీ నాయకులు రమేష్‌నాయుడు, రంగాపురం మధుసుదన్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ్ కుమార్‌నాయుడులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంకటాపురం గ్రామానికి చెందిన ఆలమూరు సంజీవ కుమార్ నాయుడు జ్ఞాపకార్థం మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ పోటీలను పులివెందుల నియోజకవర్గ పరిధిలో నుంచి సుమారు 33 టీములు వచ్చాయన్నారు. ఇందులో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిని రూ.40.116 కౌన్సిలర్ విజయకుమార్ నాయుడు, రెండవ బహుమతిని రూ.20116 డీఎస్ఆర్ యువసేన నాయకుడు డేని, మూడవ బహుమతిని రూ.10116 వైఎస్సార్ సీపీ నాయకులు మదుసుధన్‌రెడ్డి అందజేయనున్నారు. చివరి రోజు ఫైనల్ మ్యాచ్ సందర్భంగా క్రీడాకారులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నారు.

పిడుగు పడి ఎద్దు మృతి



మృతిచెందిన ఎద్దు

కొండాపురం : ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులకు పడిన పిడుగు వలన మండలంలోని సిరిగేపల్లె గ్రామానికి చెందిన అల్లపురెడ్డి వెంకటశివారెడ్డికి చెందిన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందటంతో వ్యవసాయ చేస్తూ జీవనం చేస్తున్న రైతుకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు

మాలెపాడులో నాకాబందీ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంజీవరెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామంలో ఆదివారం తెల్లవారిజామున నాకాబందీని నిర్వహించినట్లు కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఫ్యాక్షన్ గ్రామమైన మాలెపాడు గ్రామంలో నాకాబందీ నిర్వహించి గ్రామంలోని ఇరు వర్గాల నాయకుల ఇళ్లలో, గడ్డి వాములలో తనిఖీ చేసినట్లు తెలిపారు. ఫ్యాక్షన్ వీడి ప్రశాంత జీవనం సాగించాలని చిన్న చిన్న గొడవలకు పోకూడదన్నారు.

ఘనంగా జ్యోతుల మహోత్సవం

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని హనుమనుగుత్తి గ్రామంలో వెలసిన చౌడేశ్వరీదేవి అమ్మవారి ప్రతిష్ట జరిగి మూడు సంవత్సరాలు అయిన సందర్భంగా ఆదివారం గ్రామంలో జ్యోతుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

28 నుంచి ఎస్ఎఫ్ఐ శిక్షణ తరగతులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు విశాఖ పట్నంలో నిర్వహించనున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో శిక్షణ తరగతలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నూతన జాతీయ విద్యా విధానం వల్ల కార్పొరేట్ విద్యా వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకునేందుకు విద్యార్థి లోకాన్ని పోరాటాలకు సన్నద్ధం చేసేందుకు రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సునీల్, కుమార్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

కొత్త పీఆర్సీ కమిటీ వేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఐదేళ్లు పూర్తి కావస్తున్నందున కొత్త పీఆర్సీకి కమిటీ వేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాసుబ్బయ్య, సీవీ ప్రసాద్, అలీఖాన్, చెంగల్‌రెడ్డి డిమాండ్ చేశారు. 2023 జూన్ 30 నాటికి పీఆర్సీ గడువు ముగుస్తుందని, జులై 1, 2023 నుంచి కొత్త పీఆర్సీ గడువు ప్రారంభమవుతుందన్నారు. అలాగే పీఆర్సీ ఆలస్య కాలానికి ఇచ్చే మధ్యంతర భృతి కూడా జులై నుంచి ప్రకటించాలని కోరారు.

తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చాలి

పోరుమామిళ్ల : పిల్లలు విద్యార్థి దశలో చదువుకే అంకితమై తల్లిదండ్రుల ఆశలు నెరవేర్చేందుకు కష్టపడాలని హెడ్మాస్టర్ అబ్దుల్‌హుసేన్ తెలిపారు. ఆదివారం ఆయన గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌ను సందర్శించి పిల్లలతో మాట్లాడారు.

జలకాలాటలలో.. ఏమి హాయిలే ఇలా



కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు



సేద తీరుతున్న పెద్దలు, వృద్ధులు

పులివెందుల రూరల్ : ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు పిల్లలు, పెద్దలు, వృద్ధులు సైతం కాలువలో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు. వేసవికాలంలో పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో పిల్లలు కాలువలో కేరింతలు కొడుతున్నారు. మరికొంతమంది పెద్దలు వారి పిల్లలకు ఈత నేర్పించేందుకు మునగ బెండ్లు, వాటర్ క్యాన్లు, ట్యూబులు ఉపయోగిస్తూ ఈత నేర్పిస్తున్నారు. ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో బావులలో ఎక్కడ చూసినా నీరు పుష్కలంగా ఉండేవి. కాల క్రమేనా బావులలో నీరు కనుమరగయ్యాయి. రైతులు తోటలలో బావులు అడ్డంగా ఉన్నాయని పూడ్చివేశారు. బావులు లేక బోర్లలో నీటితో పంటలకు నీటి తడులు అందించే పరిస్థితి ఉంది. దీంతో పిల్లలకు, పెద్దలకు కాలువ నీరే ఈత కొలనుగా మారాయి.

పాలిసెట్‌లో మెరిసిన ఆణిముత్యాలు



విద్యార్థినిని శాలువతో సత్కరిస్తున్న వైఎస్ అభిషేక్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : ఉచిత విద్యా ఉపాధ్యాయ బృందం కృషి అభినందనీయమని..అందుకు ఫలితంగా విద్యార్థులు పాలిసెట్‌లో ఉత్తమ ర్యాంకులు సాధించారని వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి తెలిపారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల(మెయిన్)లో గతనెల రోజుల పాటు నిర్వహించిన పాలిసెట్ ఉచిత శిక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆదివారం వైఎస్సార్ సీపీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు చైర్మన్ చిన్నప్పలు అభినందించి అవార్డులు అందజేశారు. రాష్ట్ర స్థాయి ఉత్తమ ర్యాంకులు సాధించిన వారిలో గాయత్రి 114 మార్కులతో 178 ర్యాంకుతో ప్రథమ స్థానం సాధించగా గీతిక 97 మార్కులకు 1212 ర్యాంకు, విశృత్ 97 మార్కులతో 1229, సాయిధీరజ్ 96 మార్కులతో 1265 ర్యాంకులు సాధించగా వీరితోపాటు 20 వేల ర్యాంకులోపు 25 మంది సాధించారు. ఈ ఏడాది 260 మంది పాలీసెట్ ప్రవేశ పరీక్షరాయగా 243 మంది అర్హతసాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందించి వారిని మంచి విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న ప్రతిఒక్క ఉపాధ్యాయునికి ప్రత్యేకంగా అభినందనలు తెలుపుతూ ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను శాలువలతో సత్కరించారు.

సర్వాంగ సుందరంగా రామాలయం



ప్రారంభానికి సిద్ధమైన రామాలయం

పెద్దముడియం : మండలంలోని ఎన్.కొట్టాలపల్లెలో సర్వాంగ సుందరంగా అయోధ్య రామాలయం రూపుదిద్దుకుంది. ఎండోమెంట్ నిధులు రూ.40 లక్షల మంజూరు కావడం ప్రజల భాగస్వామ్యంతో దాదాపు రూ.80 లక్షలతో నూతన అయోధ్య రామాలయంను పునర్మించినట్లు నిర్వాహకులు తెలిపారు. నేటి నుంచి మూడు రోజుల పాటు ఆలయ జీర్ణోద్ధరణ, దేవతా మూర్తుల విగ్రహప్రతిష్ట, హోమాలు, కలశ పూజ తదితర పూజాది కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అదే విధంగా 24వ తేదీ న్యూకేటగిరి వృషభరాశులకు బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మొదటి బహుమతి రూ.70,000 మొదలుకొని 9 బహుమతులు అందజేస్తారన్నారు. మరిన్ని వివరాలకు 8639674115, 9014767142 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

గాలి వాన బీభత్సం



దర్బార్‌పేట గ్రామంలో ఇంటిపై పడ్డ వేపచెట్టు

పెండ్లిమర్రి : మండలంలోని దర్బార్‌పేట, వెంకటాపురం, కొత్తపేట గ్రామాల్లో ఆదివారం సాయంత్రం గాలి వాన బీభత్సం సృష్టించింది. దర్బార్‌పేటలో వేపచెట్లు, విద్యుత్ స్తంభాలు ఇళ్లపై పడ్డాయి. దర్బార్‌పేటలో నడిపెన్న, వెంకటసుబ్బయ్య ఇళ్లపై వేపచెట్లు పడటంతో ఇంటి రేకులు దెబ్బతిన్నాయి. వెంకటాపురం, కొత్తపేట గ్రామ పొలాల్లో సాగులో ఉన్న నిమ్మచెట్లు గాలికి నెలకొరిగాయి.

చెన్నూరులో భారీ వర్షం

చెన్నూరు : మండల వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం పెనుగాలులతో కూడిన భారీవర్షం కురిసింది. కొన్నిచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. విద్యుత్ అధికారులు ముందుజాగ్రత్తగా మూడు గంటల నుంచి విద్యుత్ నిలుపుదల చేశారు. ప్రజలకు ఈ వర్షంతో ఉపశమనం లభించినట్టైంది. వర్షానికి భవానినగర్, స్టేట్ బ్యాంకు పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నీరంతా రోడ్డుపై నిలిచింది.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



విద్యార్థులకు డ్రాయింగ్‌లో శిక్షణనిస్తున్న లైబ్రేరియన్ నాగాంజలి

కమలాపురం : విద్యార్థులు డ్రాయింగ్, వ్యాసరచన తదితర అంశాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు డ్రాయింగ్ వేయడంలో శిక్షణ నిచ్చారు. అనంతరం పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో మెలకువలు నేర్పించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు గ్రంథాలయాల్లో ఏర్పాటు చేసే సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే వివిధ అంశాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. అలాగే పుస్తక పఠనం అలవరచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

సింహాద్రిపురం : స్థానికి గ్రంథాలయాల్లో ఆదివారం నిర్వహించిన సమ్మర్ క్యాంపులో భాగంగా వేసవి సెలవులు వృథా కాకుండా పిల్లలను గ్రంథాలయాలకు పంపించాలని గ్రంథాలయ అధికారి శేఖర్ తెలిపారు. పిల్లలకు నీతి కథలు, రామాయణం చదవడంపై అవగాహన కల్పించారు. ఈ అవకాశాన్ని పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో పోలేరమ్మ జాతర

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో ఆదివారం నిర్వహించిన పోలేరమ్మ జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. గ్రామశివారులోని పోలేరమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఆలయ ఆవరణలో పోలేరమ్మకు బోనాలు సమర్పించారు. బయనపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డిశ్రీకాంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప జిల్లా అధ్యక్షులు, కడప మేయర్ కె.సురేష్‌బాబులు జాతరలో పాల్గొని పోలేరమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతిని ప్రొద్దుటూరు మండలం ఖాదర్‌బాద్‌కు చెందిన బి.మల్లికార్జున్‌యాదవ్ రూ.50,116లు, ద్వితీయ బహుమతి బద్వేలు సమీపంలోని గోపవరం మండలానికి చెందిన నెమలయ్య రూ.40,116లు, తృతీయ బహుమతి చాపాడు మండలం పెద్దచీపాడు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లుశర్మలకు రూ.30,116లు, చతుర్ధ బహుమతిని బద్వేలు మున్సిపాలిటీ గుంతపల్లె గ్రామానికి చెందిన ఎం.వి.ఎస్.చౌదరి రూ.20,116లు, పంచమ బహుమతిని వేముల మండలం రంగోరిపల్లె గ్రామానికి చెందిన ఎం.రామసుబ్బారెడ్డి వృషభాలు కైవసం చేసుకోగా వీరికి రూ.10,116లు బహుమతిగా అందజేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మైదుకూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో 1982–83లో పదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు ఎక్కడెక్కడ నుంచో వచ్చి స్థానికంగా ఉన్న ఓ కల్యాణ మండపంలో గెట్ టు గెదర్ నిర్వహించారు.

తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి వారి సమక్షంలో చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పాఠశాలలో చేసిన చిలిపి పనులను గుర్తుకు తెచ్చుకొని జ్ఞాపకాలను పంచుకున్నారు. ధనపాల జగన్‌మోహన్, సిందే రవిచంద్ర, శీలం వెంకటరాముడు, డాక్టర్ ఉషాదేవి, కె.రవిప్రకాష్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

జమ్మలమడుగు : మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని సోమవారం ఉదయం11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ అధ్యక్షతన ప్రజా సమస్యలపై, హౌసింగ్ నిర్మాణం, పలు అభివృద్ధి కార్యక్రమాలపై నిర్వహించడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులందరూ హాజరు కావాలని సూచించారు.

ఆర్‌జేడీకి సమస్యలపై వినతి

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని తుమ్మలపల్లెలో ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డికి పలువురు ఉపాధ్యాయులు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. మండలంలోని తుమ్మలపల్లెలో గంగమ్మచింతలలో ఆదివారం పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రాజమోహన్ రెడ్డి ఏర్పాటు చేసిన విందుకు ఆయన హాజరయ్యారు. గంగమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఆయన సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామన్నారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

జమ్మలమడుగు : హెచ్ఐవీని నివారించటానికి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ రఫిక్ పాషా తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ హెచ్ఐవీ దినోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. హెచ్ఐవీ సోకిన వారిపట్ల సమాజం ఎటువంటి వివక్ష చూపకుండా మనలో ఒక్కరిగా వారిని గుర్తించుకోవాలన్నారు. అనంతరం పాత బస్టాండ్ వరకు కొవ్వత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాపరెడ్డి, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొల్లి నాగేశ్వరరావు సేవలు ఎనలేనివి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రైతాంగ పోరాట యోధుడు కొల్లి నాగేశ్వరరావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో కొల్లి నాగేశ్వరరావు మూడవ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యల పరిష్కారం కోసం సాగు నీటి ప్రాజెక్టుల సాధన కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కొమ్మద్ది ఈశ్వరయ్య, ఎంవీ సుబ్బారెడ్డి, బాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులోని కొండావధూత ఆశ్రమం, గోవిందయ్యమఠం ఆవరణలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ నవమ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ కార్యనిర్వాహణాధికారి సి.శివయ్య, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ బాదిరెడ్డి వెంకటరామిరెడ్డిల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 23వ తేదీ ఉదయం అంకురార్పణ, నవకలశస్నపనం, 24న ఉదయం ధ్వజారోహణం, కుంభప్రతిష్ట, సాయంత్రం శేషవాహనంపై గ్రామోత్సవం, 25న ఉదయం చతుస్థానార్చన, మూలమూర్తిహోమం, సాయంత్రం ఎదురుకోళ్ళు, 26న ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం హనమంత వాహనసేవ, 27న ఉదయం మూలమూర్తిహోమం, ఉత్సవబలి, సాయంత్రం గరుడవాహనంపై గ్రామోత్సవం, 28వ తేదీన ఉదయం అశ్వవాహనసేవ, చక్రస్నానము, సాయంత్రం ధ్వజావరోహణం, అనంతరం పుష్పయాగము కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఎంపీని కేసులో ఇరికించేందుకు కుట్ర

బద్వేలు : ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని ఏదో ఒక విధంగా అరెస్టు చేయించాలనే ఉద్దేశ్యంతో ఎల్లోమీడియా కుట్ర పూరితంగా వార్తలు ప్రచురిస్తుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే వివేకానందరెడ్డి హత్య జరిగినా అప్పుడు ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు.

పది విద్యార్థులకు ప్రోత్సాహకాలు

పులివెందుల టౌన్ : 2023 ఏప్రిల్‌లో నిర్వహించిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ అగ్రశేణిలో నిలిచిన విద్యార్థులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందించనుందని ఎంఈఓ బండి వీరారెడ్డి తెలిపారు. ఈ ప్రోత్సాహకాలను ఈనెల 25వ తేదీన ప్రభుత్వ ఉన్నత పాఠశాల మెయిన్‌లో నిర్వహించే అభినందనసభలో నగదు ప్రోత్సాహకాలు ఉంటాయని ఆయన అన్నారు. పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నాగేలి వేమ లావణ్య(585) మార్కులు, వేంపల్లె ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థిని షేక్ అమ్మాజాన్(581), వేంపల్లె టీఎస్ జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని దాసరి చందన(579), సింహాద్రిపురం మండలం హిమకుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బుక్కె చిరునాయక్(579)లు జగనన్న ఆణిముత్యాలలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరచి పాఠశాల స్థాయిలో తొలి విజయాన్ని అందుకున్న పులివెందుల ఆణిముత్యాలు అయిన వారిని విద్యాశాఖ తరపున సత్కరించడం జరుగుతుందన్నారు. మొదటిస్థాయిలో ఉన్న విద్యార్థికి రూ.15వేలు, రెండవ, మూడవ స్థాయిలోని వారికి రూ.10వేలు, రూ.5వేలు నగదు ప్రోత్సాహకం ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే పాఠశాల టాపర్‌గా వచ్చిన వారికి కూడా ప్రోత్సహిస్తూ సత్కరించడం జరుగుతుందని తెలిపారు.

అంకాలమ్మకు మకరతోరణం బహుకరణ



వెండి మకరతోరణాన్ని అందించిన కృష్ణవేణమ్మ, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అంకాలమ్మ ఆలయంలో అమ్మవారికి పొలిశెట్టి వెంకటరత్నమయ్య, కృష్ణవేణమ్మ దంపతుల ఆధ్వర్యంలో వెండి మకరతోరణం అందజేశారు. ఆదివారం ఆలయ చైర్మన్ నాగేంద్ర ప్రసాద్, ఈఓ రమణలకు రూ.3.5 లక్షలు విలువచేసే 4.5 కిలో వెండి మకరతోరణాన్ని అందించి విశేష పూజలు జరిపించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి క్రిష్ణవేణమ్మను ఆలయ మర్యాదలతో శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ టీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

వేంపల్లె : ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ 13వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు ఇడపులపాయలోని వైఎస్సార్ ఘాట్‌వద్దకు చేరుకుని సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కట్‌చేసి నాయకులు ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.ఓబుళపతి, నాయకులు గిరిధర్‌రెడ్డి, రాజమోహన్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అనంతపురం జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీఎఫ్ కడప, పెండ్లిమర్రి మండల కార్యవర్గం ఎన్నిక



మాట్లాడుతున్న రామాంజనేయులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపలోని అక్షర స్కూలులో ఆదివారం జరిగిన ఎస్టీఎఫ్ కడప, పెండ్లిమర్రి ఉపాధ్యాయుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కడప మండల అధ్యక్షుడిగా రామిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గాలి శ్రీనివాసులును ఎన్నుకున్నారు. పెండ్లిమర్రి మండల అధ్యక్షుడిగా ఆర్.ప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్ ఖాదర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీఎఫ్‌నిరంతరం పనిచేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శులు ఆవుల రామచంద్ర, వెంకటసుబ్బయ్య, జిల్లా నాయకులు సాగర్, అబ్దుల్ సలాం, రవిశంకర్, ప్రదీప్‌రెడ్డి, నాగమహేశ్వరయ్యలు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి



అలంకరణలో అనిమెల బోగాదమ్మ

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. పోతురాజు వద్ద ముద్దలను ఏరాటు చేసి జంతుబళులు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలోని పచ్చని చెట్ల మధ్య బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు. ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోగాదమ్మకు ఘనంగా పూజలు

వీరపునాయునిపల్లె : అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండ వద్ద వెలసిన బోగాదమ్మ, తలపనూరు గ్రామ పంటపొలాల్లో వెలసిన గంగమ్మతల్లికి ఆదివారం భక్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మూల మూర్తులను సుందరంగా అలంకరించారు. వేసవి సెలవులు కావడంతో తమ గ్రామాలకు వచ్చిన వారంతా కుటుంబ సభ్యులతో కలసి ఆలయాలకు వెళ్లి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో నషాన్

కడప కల్చరల్ : కడప నగరం రహమతుల్లావీధిలోని చాంద్‌ఫిరా గుంబద్ దర్గా ఉరుసు నషాన్ ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా ముతవల్లీ అమీరున్నీసా తమ ఇంటి నుంచి ఫకీర్ల మేళతాళాల సందడి మధ్య దర్గా వద్దకు గంధం కలశాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. గురువుల మజార్ వద్ద గంధాన్ని సమర్పించి ఫాతెహా చేశారు. దర్గా ఆవరణలో జెండా ప్రదేశంలో నషాన్ ఉత్సవం నిర్వహించి జెండాను అలంకరించారు. హాజరైనభక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్థానిక డివిజన్ ప్రముఖులు, పెద్ద సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ముగిసిన బాలల యోగా శిబిరం



మాట్లాడుతున్న రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి భీతి హరానంద

కడప కల్చరల్ : వేసవి సందర్భంగా స్థానిక పటేల్‌రోడ్డులోని మిత్ర యోగా సెంటర్‌లో 21 రోజులపాటు నిర్వహించిన బాలల యోగా శిక్షణాశిబిరం ముగింపు సమావేశం ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి భీతిహరానంద మాట్లాడుతూ చిన్న పిల్లల్లో శారీరక, మానసిక ధృడత్వానికి, ఏకాగ్రత పెరగడానికి, నైతిక విలువలు అలవడడానికి యోగా సాధన ఉత్తమ మార్గమన్నారు. దైనందిన జీవితంలో ఆహారపు అలవాట్లకు కూడా ప్రాధాన్యత ఉందని, తాజాగా ఇంటిలో వండిన ఆహారానికే ప్రాముఖ్యత ఇవ్వాలని, పిజ్జాల, బర్గర్‌ల సంస్కృతికి దూరంగా ఉంటేనే రోగాలు దరిచేరవన్నారు. యోగాసనాల సాధన వల్ల శారీరక దారుఢ్యంతోపాటు మానసికంగా ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కొనే సామర్థ్యం పిల్లలలో ఏర్పడగలదన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం వ్యాయామ విద్య, క్రీడాశాస్త్ర సంచాలకులు డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ చిన్న వయస్సు నుంచే విద్యార్థులను తల్లిదండ్రులు యోగా సాధన వైపు ప్రోత్సహించాలని, విద్యార్థుల రోజువారి జీవితాలలో యోగా సాధన ఒక భాగం కావాలని, అప్పుడే పిల్లలు శక్తివంతమైన, ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. రామకృష్ణ మిషన్ స్వామిజీ సంకర్షణానంద, యోగా థెరపిస్టు డాక్టర్ కె.కల్పన, యోగా నిపుణులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.